నిలువ నీడలేని ప్రయాణం

- బస్‌షెల్టర్లు లేక ప్రయాణికుల ఇక్కట్లు
- ఎండకు ఎండుతూ..వానకు తడుస్తూ తీవ్ర అవస్థలు
- బస్టాండ్ నిర్మించాలని డిమాండ్



పెనుగంచిప్రోలు పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో బస్సుల కోసం దుకాణాల ముందు వేచి ఉన్న ప్రయాణికులు

పెనుగంచిప్రోలు: మండల కేంద్రం పెనుగంచిప్రోలుతోపాటు మండలంలోని ఇతర గ్రామాల్లో ప్రయాణికులకు బస్‌షెల్టర్లు లేకపోవడంతో నిత్యం ప్రయాణికులు ఇబ్బందులుపడుతున్నారు. ముఖ్యంగా వేసవిలో ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో మధ్యాహ్నం బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. ఎండ నుంచి రక్షణ కోసం రోడ్డు పక్కన ఉండే టీ స్టాల్స్, వ్యాపార దుకాణాల ఎదుటే బస్సుల కోసం నిరీక్షించాల్సి దుస్థితి ఏర్పడింది. పెనుగంచిప్రోలు నుంచి జగ్గయ్యపేట, నందిగామ, విజయవాడ, మధిర, ఖమ్మం, హైదరాబాద్‌లకు రోజూ ఆయా డిపోల నుంచి 50 బస్సు సర్వీసులు నడుస్తుంటాయి. నిత్యం భారీసంఖ్యలో భక్తులు, గ్రామస్తులు రాకపోకలు సాగిస్తుంటారు.

ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు..

శ్రీతిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం ఉన్నందున పెనుగంచిప్రోలు ప్రముఖ పుణ్యక్షేత్రంగా వర్ధిల్లుతున్నప్పటికీ బస్టాండ్ నిర్మాణానికి నోచుకోలేదు. కనీసం ప్రయాణికులు రద్దీగా ఉండే ప్రాంతాల్లో కూడా బస్‌షెల్టర్లు కూడా లేవు. పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో విజయవాడ, నందిగామ, జగ్గయ్యపేట, మధిర, ఖమ్మం వెళ్లే ప్రయాణికులతోపాటు పరిసర ప్రాంతాలైన సుబ్బాయిగూడెం, కొల్లికుళ్ల, వెంకటాపురం, శనగపాడు, ముండ్లపాడు, అనిగండ్లపాడు, గుమ్మడిదూర్రు, శివాపురం గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు, వత్సవాయి మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు బస్సుల కోసం రోడ్లపై నిల్చుంటూ తీవ్రఇబ్బందులు పడుతున్నారు. సుబ్బాయిగూడెం క్రాస్‌రోడ్స్, కొణకంచి క్రాస్‌రోడ్స్ వద్ద కూడా బస్‌షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు ఎండా కాలం ఎండకు, వానాకాలం వానకు తడుస్తూ అవస్థలుపడుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు బస్‌షెల్టర్ల నిర్మాణం గురించి పట్టించుకోకపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

దుకాణాలు, టీ స్టాళ్లే బస్‌షెల్టర్లు...

ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, మహిళలు ఎండకు తట్టుకోలేక టీ దుకాణాలు, ఇతర వ్యాపార దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. ముఖ్యంగా అమ్మవారి దర్శనానికి నిత్యం వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. వారందరూ నిలువ నీడలేక ఇబ్బందిపడుతున్నారు. ఆలయం వద్ద కూడా ఏర్పాటు చేసిన రేకులతో వేసిన బస్‌షెల్టర్ ప్రయాణికులకు ఏమాత్రం సరిపోవడం లేదు.



శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద అడ్డంగా నిలిపిన వాహనాలు

ఎండ తీవ్రత కూడా అధికంగా ఉండటంతో ఆ రేకుల షెడ్‌లో ఉండేందుకు ఇబ్బందిగా ఉందని భక్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బస్టాండ్‌తోపాటు అవసరమైనచోట బస్‌షెల్టర్లు నిర్మించాలని భక్తులు, మండల ప్రజలు కోరుతున్నారు.

బస్టాండ్ ఏర్పాటు చేయాలి..



పెనుగంచిప్రోలులోని నాలుగు రోడ్ల కూడలి పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో తక్షణం కనీసం బస్‌షెల్టర్ నిర్మించాలి. షెల్టర్లు లేకపోవడంతో ఎండకు రోడ్లపై నిల్చోలేక పోతున్నాం. వివిధ గ్రామాలకు వెళ్లే వారంతా రోడ్ల పక్కన దుకాణాల ముందు నిలబడాల్సి వస్తోంది. బస్టాండ్ నిర్మాణంపై అధికారులు దృష్టిసారించాలి.

– ఎం.లాజర్, ప్రయాణికుడు

అధికారులు స్పందించాలి..



బస్‌షెల్టర్ల నిర్మాణం విషయంలో అధికారులు స్పందించాల్సి ఉంది. అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు కూడా దృష్టి సారించాలి. ఎండాకాలం ఎండకు, వానాకాలం వానకు అనేక ఇబ్బందులు పడుతున్నాం. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, పిల్లలతో అవస్థలు పడుతున్నాం.

– భారతి, పెనుగంచిప్రోలు

క్లుప్తంగా

పాఠశాల పరిశీలన

పెద్దాపురం(వీరులపాడు): ఉపాధ్యాయులు సమయపాలన పాటించడంతోపాటు విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన చేయాలని ఎంఈవో పాల్‌కెనడీ సూచించారు. మండలంలోని పెద్దాపురం ఏహెచ్‌యుపి పాఠశాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యా బోధన చేయాలన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం నుంచి వచ్చిన పాఠ్య పుస్తకాలు, బ్యాగులు తదితర సామాగ్రిని విద్యార్థులకు పంపిణీ చేయాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



కంచికచర్ల : గండేపల్లి ఎంపీపీ స్కూల్‌లోని విద్యార్థులకు శనివారం పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేపట్టారు. కార్యక్రమానికి ఎంపీటీసీ సభ్యురాలు పిల్లి భాగ్యలక్ష్మి హాజరై విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం పంపిణీ చేశారు.

ఈసందర్భంగా ఎంపీటీసీ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అన్ని వసతులతోపాటు సౌకర్యాలు కల్పించిందన్నారు. డిజిటల్ క్లాస్ రూంలు, గ్రీన్ బోర్డులు, బెంచీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అధికారంలోకి వచ్చిన కొత్త ప్రభుత్వం కూడా విద్యకు పెద్దపీట వేసి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.రవికుమార్, ఉపాధ్యాయులు మేరుగ రామారావు, జె.జ్యోతి, గ్రేస్‌మణి, విజయపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాయిబాబాకు లక్ష మల్లెలార్చన



నందిగామ: స్థానిక చెరువుబజారు షిరిడీ సాయి మందిరం 23వ వార్షిక మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా శనివారం స్వామివారికి విశేష పూజలు చేశారు. లోకశాంతిని కాంక్షిస్తూ పలు రకాల హోమాది కార్యక్రమాలు జరిగాయి. అనంతరం స్వామివారికి లక్షమల్లెలార్చన చేశారు. ఆయా పూజా కార్యక్రమాల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

పెనుగంచిప్రోలు: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన సంఘటన పెనుగంచిప్రోలులో శనివారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు బండి వెంకటరత్నం తన ఎడ్లను మేత కోసం మునేరు అవతల మాగాణి పొలానికి తోలుకెళ్లాడు. ఈక్రమంలో రెండు రోజుల కిందట వచ్చిన గాలిదుమ్ముకు తెగిపడిన విద్యుత్ తీగను ఒక ఎద్దు తొక్కింది. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఎద్దు విలువ రూ.లక్ష ఉంటుందని రైతు తెలిపారు. సంఘటనా స్థలాన్ని పశువైద్యాధికారి పి.అనిల్ సందర్శించి, పోస్టుమార్టమ్ నిర్వహించారు. రెవెన్యూ అధికారులు పంచనామా నిర్వహించారు.

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



చిల్లకల్లు(జగ్గయ్యపేట): అంగనవాడీలకు వచ్చే చిన్నారులపై కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ జిల్లా పీడీ ఉమాదేవి సూచించారు. పెనుగంచిప్రోలు సెక్టార్‌కు చెందిన చిన్నారులకు చిల్లకల్లులో శనివారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగనవాడీ కార్యకర్తలు విధుల్లో అలసత్వం వహించరాదన్నారు. బాల్య వివాహాలను నివారించడంతోపాటు బాల్యవివాహాల కారణంగా కలిగే అనర్థాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలకు క్రమం తప్పకుండా పంపిణీ చేయాలని ఆదేశించారు. అనంతరం చిన్నారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీడీపీవో లక్ష్మీభార్గవి, సూపర్‌వైజర్లు అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి చలువ కళ్లజోళ్లు

నందిగామ: పట్టణంలోని ఐకాన్ కేర్ హాస్పిటల్ వారు పట్టణంలోని పోలీసు సిబ్బందికి 62 చలువ కళ్లజోళ్లను అందజేశారు. హాస్పిటల్ యాజమాన్యం శనివారం ఇన్‌స్పెక్టర్ హనీష్‌కు చలువ కళ్లజోళ్లను అందజేసింది. ఈ కళ్లజోళ్లను పోలీసు సిబ్బంది, హోంగార్డులకు అందజేయనున్నట్లు ఇన్‌స్పెక్టర్ హనీష్ తెలిపారు. పోలీసు సిబ్బంది కంటి సంరక్షణ కోసం కళ్లజోళ్లను అందజేసిన ఐకాన్ కేర్ హాస్పిటల్ యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రభాకరరావుకు ఘననివాళి

నందిగామ: దివంగత ఎమ్మెల్యే తంగిరాల ప్రభాకర్‌రావు 10వ వర్ధంతిని శనివారం నందిగామ నియోజకవర్గవ్యాప్తంగా ఆయన అభిమానులు, టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మధిరరోడ్డులో ఉన్న తంగిరాల ప్రభాకర్‌రావు ఘాట్‌ను ఆయన కుమార్తె, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుతోపాటు పలువురు నాయకులు సందర్శించి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. అనంతరం గాంధీసెంటర్‌లో అన్నదానం చేశారు. న్యాయవాదుల ఆధ్వర్యంలోనూ ప్రభాకరరావు వర్ధంతిని నిర్వహించారు.



ప్రభాకర్‌రావు ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న నందిగామ ఎమ్మెల్యే సౌమ్య, నాయకులు

ఆయన చిత్రపటానికి పలువురు న్యాయవాదులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవం



దివ్యబలి పూజ నిర్వహిస్తున్న బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, గురువులు

జగ్గయ్యపేట అర్బన్: యేసుక్రీస్తు ఆచరించి చూపిన ప్రేమ జీవితాన్ని ప్రతిఒక్కరూ ఆచరించాలని విజయవాడ పీఠాధిపతులు రెవ తెలగతోటి జోసఫ్ రాజారావు సూచించారు. జగ్గయ్యపేట పట్టణంలో బాలుర హైస్కూల్ రోడ్డులో ఉన్న యేసు తిరుహృదయ రోమన్ క్యాథలిక్(ఆర్‌సీఎం) విచారణ చర్చి 12వ వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన జోసఫ్ రాజారావు చర్చిలో సమిష్టి దివ్యబలి పూజను నిర్వహించారు. చర్చి విచారణ ఫాదర్ గుడిసె జయరాజు మాట్లాడుతూ 80ఏళ్లనాటి చర్చిని 2012లో పునర్నిర్మించామని, అప్పటి నుంచి ఏటా వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. అనంతరం నిర్వహించిన ప్రేమవిందులో పెద్ద సంఖ్యలో సంఘస్తులు, విశ్వాసులు పాల్గొన్నారు. క్రైస్తవ కళాకారుడు గుమ్మడి జీవన్‌కుమార్ బృందంచే ప్రదర్శింపబడిన లాజరు–ధనవంతుడు అనే గొప్ప బైబిల్ నాటకం అందరినీ అలరించింది. కార్యక్రమంలో విచారణ గురువులు, సెయింట్‌ఆన్స్ సిస్టర్లు, సంఘస్తులు, విశ్వాసులు పాల్గొన్నారు.



నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

రేపు ఐజీఎంసీ స్టేడియంలో ఈదుల్ అజ్‌హా నమాజు

లబ్బీపేట(విజయవాడతూర్పు): బక్రీద్‌ను పురస్కరించుకుని ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఈదుల్ అజ్‌హా నమాజు నిర్వహిస్తున్నట్లు ఆ కమిటీ జనరల్ సెక్రటరీ మునీర్ అహ్మద్ షేక్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం నమాజుకు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను స్టేడియంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా బక్రీద్ సందర్భంగా సామూహిక ఈదుల్ అజ్‌హా నమాజు నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం ఉదయం 7 గంటలకు ఈద్ నమాజు, 7.30 గంటలకు ఈద్ సందేశం ఉంటుందని చెప్పారు. ఈ నమాజులో ముస్లింలందరూ అత్యధిక సంఖ్యలో పాల్గొని ఇహపరలోకాల సాఫల్యం పొందగలరని కోరారు. కార్యక్రమంలో ఈద్గా కమిటీ కోశాధికారి ఎండీ అన్వర్ పాషా, కార్యదర్శి ఎండీ ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.



నమాజు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మునీర్ అహ్మద్ తదితరులు

ఈ - వేస్ట్‌పై అవగాహన

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా శనివారం పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు ఈ – వేస్ట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పర్యావరణాన్ని కాపాడుదామంటూ ప్లకార్డులు పట్టుకొని ప్రదర్శించారు. అనంతరం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్ మాట్లాడుతూ కంప్యూటర్ ల్యాబ్‌లోని ఈ – వేస్ట్‌ను తొలగించాలన్నారు. అనంతరం తరగతి గదుల్లో, పరిసర ప్రాంతాల్లో ఈ – వేస్ట్‌ను సేకరించి ఎలా నిల్వ చేయాలనే అంశాలను ఆయన విద్యార్థులకు వివరించారు.

21న శ్రీచక్ర నవ ఆవరణార్చన

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ఈ నెల 21వ తేదీ శుక్రవారం శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన శ్రీశివకామేశ్వరి అమ్మవారికి శ్రీ చక్ర నవ ఆవరణార్చన నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం పౌర్ణమి కలిసి రావటంతో తాము ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తామన్నారు. ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

18న హక్కుల వేలం

నందిగామ:మండలంలోని సత్యమ్మ అమ్మవారి ఆలయం వద్ద భక్తులు కొట్టిన కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కులకు ఈనెల 18వ తేదీ ఉదయం పదిగంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి.సీతారామయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవాదాయ ధర్మాదాయశాఖ నిబంధనల మేరకు ఆలయ ప్రాంగణంలో నిర్వహించే ఈ వేలంలో ఆసక్తిగలవారు పాల్గొనాలని ఆయన కోరారు.

చిరస్మరణీయుడు కార్మిక నేత సుబ్బారెడ్డి



భవానీపురం(విజయవాడపశ్చిమ): కార్మికుల హక్కుల కోసం తుది శ్వాస వరకు పోరాడిన తిరుమారెడ్డి సుబ్బారెడ్డి చిరస్మరణీయుడని పలువురు కార్మిక నాయకులు కొనియాడారు. మాజీ కార్పొరేటర్, సీఐటీయూ నగర అధ్యక్షుడు టి.సుబ్బారెడ్డి ఐదో వర్ధంతి సందర్భంగా భవానీపురంలోని ఐరన్ యార్డ్‌లో శనివారం నివాళులర్పించారు. ముఠా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాములు, సీపీఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు, యూటీఎఫ్ మాజీ నాయకులు తిరుపతిరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఠా కార్మికుల సమగ్ర సంక్షేమ చట్టం, వారి సంప్రదాయ హక్కులు, పని భద్రత కోసం నగరంలో అనేక పోరాటాలకు నాయకత్వం వహించిన సుబ్బారెడ్డి ఎత్తిన ఎర్ర జెండా విడువకుండా కడవరకు కార్మికుల పక్షాన పోరాడిన కార్మిక యోధుడని పేర్కొన్నారు. కార్మికుల కుటుంబాల్లో అందరికీ బీమా అమలు అయ్యేలా ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఇల్లు లేని కార్మికులకు ఇల్లు కేటాయించాలని, వారి బిడ్డలకు కేజీ నుంచి పీజీ వరకు ప్రభుత్వం ఉచిత విద్య అందించాలని కోరారు. ముఠా ఆటోలపై పోలీస్, ఆర్టీఓ అక్రమ కేసులు అరికట్టాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నగర నాయకులు రోశయ్య, ఎ.వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, కె. వెంకట రమణ, రామారావు తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ నిత్యాన్నదానానికి 10 టన్నుల కూరగాయల అందజేత

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): తిరుమల తిరుపతిలో జరిగే నిత్యాన్నదానికి కూరగాయలు వితరణ చేసే అవకాశం రావడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని దాతలు నిమ్మగడ్డ చంద్రశేఖవర్మ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి 10 టన్నుల కూరగాయల లారీని స్థానిక మొగల్రాజపురంలోని సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ రోడ్డులో లారీకి పూజలు చేసి జెండా ఊపి తిరుమలకు శనివారం పంపారు. వెంకటేశ్వర భక్త సమాజం ప్రతినిధులు యలమంచిలి ఈశ్వరరావు, తోటకూర రాజా, చలసాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగా నేత్ర వైద్యశిబిరం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అమరావతి ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం(పాతశివాలయం) ఆవరణలో మెగా నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ గౌరవాధ్యక్షుడు వావిలాల రజనీకాంతశర్మ తెలిపారు. శిబిరంలో అత్యాధునిక యంత్రాల సాయంతో వైద్య పరీక్షలు చేయటం, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందిస్తామని తెలిపారు. ఆలయ సిబ్బంది, భక్తులు, దుకాణాల యజమానులు, సిబ్బంది అందరూ ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అన్నా క్యాంటీన్ ప్రారంభానికి చర్యలు

ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య



పేటలో అన్నా క్యాంటీన్ భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక సీతారామపురంలోని కమలా థియేటర్ సెంటర్‌లో ఉన్న అన్నా క్యాంటీన్ పునఃప్రారంభించేందుకు తగుచర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అధికారులను ఆదేశించారు. టీడీపీ నాయకులతో కలిసి శనివారం ఆయన అన్నాక్యాంటీన్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ అన్నా క్యాంటీన్ పునరుద్ధరణకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకున్నందున జగ్గయ్యపేటలోని అన్నా క్యాంటీన్‌ను త్వరలో వినియోగంలోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

పునః ప్రారంభానికి చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు. పూర్తి స్థాయిలో నిర్వహణకు అవసరమైన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. టీడీపీ నాయకులు యలమంచిలి రాఘవ, కన్నెబోయిన రామలక్ష్మి, సూర్యదేవర రాంప్రసాద్, వేదులాపురి సైదానాయుడు, కటికల అనిల్, మున్సిపల్ డీఈ శివకోటేశ్వరరావు పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామ: పట్టణంలోని రైతుబజార్ ప్రాంతంలో ఉన్న అన్నాక్యాంటీన్‌ను మున్సిపల్ కమిషనర్ హేమమాలిని శనివారం పరిశీలించారు. అన్నా క్యాంటీన్‌ను త్వరలో ప్రారంభించేందుకు ఆప్రాంగణంలో ఏర్పాటు చేయాల్సిన వసతులపై సిబ్బందితో చర్చించారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఏఈ ఫణి శ్రీనివాసరావు, సిబ్బంది ఉన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి : కమిషనర్

నందిగామ: వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పట్టణ పరిధిలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిసారించినట్లు మున్సిపల్ కమిషనర్ కె.హేమమాలిని తెలిపారు. పట్టణ పరిధిలో సాగుతున్న పారిశుద్ధ్య పనులను శనివారం ఆమె పరిశీలించారు. ముఖ్యంగా వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రధాన డ్రైన్ల పూడికతీత పనులతోపాటు పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చేపట్టాల్సిన చర్యలపై సిబ్బందికి సూచనలు చేశారు. కమిషనర్ వెంట ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ గురునాథం, ఉన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న హేమమాలిని

ముస్లిం పెద్దలతో సమావేశం

నందిగామ: ఈనెల 17వతేదీన బక్రీద్ పర్వదినం నేపథ్యంలో శనివారం పట్టణ పోలీస్ స్టేషన్ లో ముస్లిం మతపెద్దలతో పోలీసులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి ఏసీపీ డాక్టర్ స్రవంతిరాయ్ ముస్లిం పెద్దలకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ప్రతిఒక్కరూ మతసామరస్యాన్ని పాటిస్తూ బక్రీద్ పర్వదినాన్ని నిర్వహించుకోవాలని సూచించారు. ఇన్‌స్పెక్టర్ హనీష్ మాట్లాడుతూ పండుగ రోజు పట్టణంలో ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా ప్రార్థనలు నిర్వహించుకోవాలని సూచించారు. సమావేశంలో పట్టణానికి చెందిన పలువురు ముస్లిం పెద్దలతోపాటు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ హనీష్

రూ.50వేల విలువైన నోట్‌పుస్తకాలు అందజేత

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): ముండ్లపాడు ప్రాథమిక పాఠశాల(మెయిన్), ఎస్సీకాలనీలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు శనివారం అదేగ్రామానికి చెందిన నలజాల నరేష్ తనతండ్రి సుభాన్‌రావు జ్ఞాపకార్థం రూ.50వేల విలువైన నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలతోపాటు దాతల అందిస్తున్న చేయూతను అందిపుచ్చుకుని చక్కగా చదువుకోవాలని సూచించారు. విద్యార్థులు చక్కగా చదువుకోవాలన్నారు. విద్యాభివృద్ధికి దాత నలజాల నరేష్ చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఖాజా, రామారావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్లు గొర్రెపాటి మధు, నరాల బ్రహ్మారెడ్డి, కూచి మోహనరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న నలజాల నరేష్, గుంటుపల్లి వాసు తదితరులు

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే తాతయ్య

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, జిల్లా కలెక్టర్ ఢిల్లీరావును శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్రం మధిర నియోజకవర్గంలోని పెదమండవ గ్రామం వద్ద మునేరు గండిని పూడ్చి నియోజకవర్గంలో పోలంపల్లిలో మునేరు డ్యాం కిందనున్న పంటపొలాలకు సాగునీటిని అందించాలని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఖమ్మంజిల్లా కలెక్టర్‌తో మాట్లాడి మునేరుకు పడిన గండి సమస్యను పరిష్కరిస్తానని కలెక్టర్ ఢిల్లీరావు హామీ ఇచ్చినట్లు వివరించారు. నియోజకవర్గ సమస్యలను వివరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ మేరకు కలెక్టర్‌కు ఓ వినతిపత్రం అందజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



కలెక్టర్ ఢిల్లీరావుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

ఫ్యాటీ లివర్‌పై నిర్లక్ష్యం తగదు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఫ్యాటీ లివర్ వ్యాధి ప్రస్తుతం ఎక్కువ మందిలో కనిపిస్తోందని, దానిని నిర్లక్ష్యం చేస్తే సిరోసిస్ ఆఫ్ లివర్, క్యాన్సర్‌లకు దారితీసే అవకాశం ఉందని సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ నూరే పవన్‌కుమార్ అన్నారు. సూర్యారావుపేటలోని మానస ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఫైబ్రోస్కాన్ అనే అధునాతన పరికరం ద్వారా లివర్ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ.. ఆల్కాహాలిక్‌లో ఎక్కువగా కనిపించే ఈ సమస్య నాన్ ఆల్కాహాలిక్‌లో కూడా స్థూలకాయం, సెంట్రల్ ఒబెసిటీ, కంట్రోల్‌లో లేని మధుమేహం, కొన్ని రకాల వైరస్, మందుల ద్వారా వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. ఈ వ్యాధిని ఫైబ్రోస్కాన్ ద్వారా నిమిషాల వ్యవధిలో గుర్తించవచ్చని చెప్పారు. మందులు, ఆహారపు అలవాట్లు, రోజు వారీ వ్యాయామం, స్థూలకాయులు బరువు తగ్గించుకోవడం వంటి ప్రక్రియల ద్వారా వైద్య చికిత్సలో ఫ్యాటీ లివర్‌ను రివర్సిబుల్ చేయవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్కే అయోధ్య, డాక్టర్ మానస తదితరులు పాల్గొన్నారు.



ఫ్యాటీ లివర్ దుష్ఫలితాలను వివరిస్తున్న వైద్యులు నూరే పవన్‌కుమార్, అయోధ్య, మానస